డివైడర్‌ను ఢీకొన్న ఆటో..పలువురు కూలీలకు గాయాలు

● బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

దవాఖానను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 13: కూలీలతో ప్రయాణిస్తున్న ఆటో డీవైడర్‌ను ఢీకొన్న సంఘటన మండలంలోని అద్దంకి –నార్కట్‌పల్లి రహదారిపై గూడూరు వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం జైత్రాంతండాకు చెందిన వ్యవసాయ కూలీలు నల్లగొండ సమీపంలో నాట్లు వేయడానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తున్నారు. గూడూరు వద్ద అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఆటో ఢీకొట్టింది. అందులో ప్రయా ణిస్తున్న సాయి, శాంతి, కాంతి, సేవూరి, సైది, అరుణ అనే కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108లో ప్రాంతీయ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మిర్యాలగూడ ప్రాంతీయ దవాఖానకు చేరుకుని వారిని పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య అందించాలన సూపరి ంటెండెంట్‌ను కోరారు. వీరిలో ఒకరి పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

నర్సయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

నకిరేకల్, డిసెంబర్ 13 : నకిరేకల్ పట్టణానికి చెందిన గుడిపాటి నర్సయ్య అనారోగ్య కారణంతో బుధవారం తెల్లవారుజామున మరణించారు. ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ ఎంపీటీసీ రాచకొండ వెంకన్న పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

వైభవంగా అయ్యప్ప మండల పూజ

నార్కట్‌పల్లి, డిసెంబర్ 13 : మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప ఆలయంలో వైభవంగా 22వ మహా పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోనగర సంకీర్తన చేపట్టారు. గణపతి హోమం అయ్యప్ప స్వాములు ఊరేగింపుగా వెళ్లి పట్టణంలోని శివాలయం పక్కనున్న బొడ్రాయికి పంచామృత సేవలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గురుస్వాములు రమణ, బెల్లి వెంకన్న ఆధ్వర్యంలో సకల వసతులు కల్పించారు. నగర సంకీర్తనలో గురుస్వాములు దేవుని నర్సింహ, రాపర్తి మధు, తమిళ్ శ్రీను, గడ్డం శివరాం, పర్రెపాటి గోపాల్, పర్రెపాటి లింగస్వామి, జక్కలి సతీశ్, మేడబోయిన మల్లేశ్, అయ్యప్ప, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

అయ్యప్ప పడి పూజ మహోత్సవం

రామగిరి :నల్లగొండలోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కంజర శ్రీను స్వామి ఆధ్వర్యంలో ఆలపించిన అయ్యప్ప గీతాల ఆకట్టుకున్నాయి. అయ్యప్పనామ స్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో పలువురు అయ్యప్ప దీక్ష గురుస్వాములు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

నల్లగొండ హరిహర పుత్ర అయ్యప్ప ఆలయంలో పడి పూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

● గ్యాస్ కనెక్షన్ కేవైసీకి గడువు లేదు
● అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

సూర్యాపేట, డిసెంబర్ 13 : గ్యాస్ వినియోదారులు కేవైసీ కోసం ఇబ్బందులు పడవద్దని కేవైసీ నమోదుకు చివరి తేదీ ఏమి లేదని అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్, సివిల్ సప్లయ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ వినియోగదారులు ఎలాంటి అపోహలు నమ్మొద్దని కోరారు. కేవైసీ పేరుతో వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేవైసీ అనేది ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సాధారణ ప్రక్రియ అని చెప్పారు. రూ.500కు సిలిండర్ పథకంపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి విధి విధానాలు రాలేదని చెప్పారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్‌బాబు, ఏఎస్ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడుతున్న సూర్యాపేట అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను చేరుకోవాలి

బొడ్రాయిబజార్ : దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంపొందించుకుని జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులు తమలోని అవయవ లోపాన్ని పక్కన పెట్టి ఆలోచిస్తే దేన్నైనా సాధించగలరని తెలిపారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు ఎంతో చైతన్యమై తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, దివ్యాంగుల ఓటింగ్ శాతం 95.95 శాతం నమోదు కావడమే నిదర్శనమన్నారు. దివ్యాంగుల కోరిక మేరకు సదరంలో అవకతవకలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమాధికారి జ్యోతి పద్మ, సూపరింటెండెంట్ హుస్సేన్‌నాయక్, జూనియర్ అసిస్టెంట్ సంజీవ, ఎఫ్ఆర్ఓ వినోద్‌కుమార్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.నయీమ్, బధిరుల పాఠశాల కరస్పాండెంట్ మదనాచారి పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావుకు సన్మానం

రామగిరి, డిసెంబర్ 13 : కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బుధవారం నల్లగొండకు వచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు ఆధ్వర్యంలో ఆయనను స న్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని విలేకరులతో మాట్లాడుతూ పొడుభూములకు పట్టాలను ఇప్పించేలా కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, విశ్వనాథుల లెనిన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాంబశివరావును సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

వైఆర్పీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవి ప్రసాద్ జన్మదిన వేడుకలు

నల్లగొండ రూరల్,డిసెంబర్ 13: వైఆర్పీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యెలిశాల రవి ప్రసాద్ జన్మదిన వేడుకలు స్థానిక మేకల అభివన్ స్టేడియంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ యామ దయాకర్, స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. క్రీడాకారులకు టీ షర్ట్స్, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి ప్రసాద్ ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్‌కు ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేద విద్యార్థులకు సహాయ సహకారాలు నిరంతరం అందిస్తున్నారన్నారు.

కేక్ కట్ చేస్తున్న యామ దయాకర్, గిరిబాబు

చిరుధాన్యాలతో ఆరోగ్యం

నడిగూడెం, డిసెంబర్ 13 : నిత్యం చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ప్రకృతి వ్యవసాయ సామాజిక కార్యకర్త మొలుగూరి గోపి అన్నారు. బుధవారం మండలంలోని వల్లాపురంలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై కలిగే లాభాలపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాగులు, కొర్రలు, అండు కొర్రలు, సామలు, అరికలు, జొన్నలు తదితర చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. 2023 ను ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతులు అచ్చిరెడ్డి, వెంకన్న, రామకోటి, నారాయణ పాల్గొన్నారు.

ఆకాశ దీపానికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు వీరభద్రశర్మ

విశ్వనాథుడి ఆలయంలో ఆకాశ దీప పూజ

బొడ్రాయిబజార్, డిసెంబర్ 13 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు ఆకాశ దీపం పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసం మొదటి రోజున ప్రారంభమైన ఆకాశ దీపం నెల రోజులు పూజలందుకుని బుధవారంతో ముగిసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ సహాయ అర్చకుడు సాగర్‌శర్మ, సతీశ్, శివమాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నార్కట్‌పల్లి, డిసెంబర్ 13 : నార్కట్‌పల్లి, కనగల్ మండలాల్లో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరు మృతి చెందారు. నార్కట్‌పల్లి మండలంలోని బాజకుంట గ్రామ శివారులో బుధవారం బైక్ అదుపు తప్పి కింద పడడంతో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐసైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన పింటు సోబర్, సామ్‌సంగ్ సోబర్, మంచిలీపట్నం జిల్లా చెన్నపురం గ్రామానికి చెందిన తాయిలలు మంగళవారం రాత్రి బైక్‌పై నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలు వైపునకు వెళ్తున్నారు. ఈక్రమంలో బాజకుంట గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడింది. ఈప్రమాదంలో పింటు సోబర్ అక్కడికక్కడే మృతి చెందగాసామ్‌సంగ్ సోబర్, తాయిలకు గాయాలయ్యాయి. మృతుడు సోబర్ బంధువు నడింపల్లి కృష్ణబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యాక్టివా అదుపు తప్పి ..

నల్లగొండ సిటీ : ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బుడమర్లపల్లికి చెందిన మోర రజిత (26) యాక్టివా వాహనంపై కుమ్మరి గూడెం నుంచి బుడమర్లపల్లికి వస్తుండగా కమ్మరిగూడెం గ్రామ శివారులో యాక్టివా అదుపు తప్పి కింద పడింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ..

తిప్పర్తి, డిసెంబర్ 13 : తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న సూరారంలో వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. తిప్పర్తి ఏఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామానికి చెందిన అల్లం ముత్తయ్య(75) ఈనెల 2న చిన్నసూరారం గ్రామంలో మేన కోడలు ఇంటి వెళ్లడానికి ఆటో దిగి రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముత్తయ్య గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు అల్లం రాంమూర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు.